# పిఎం సూర్య కర్ ముక్తి బిజ్లీ యువజన పోస్టర్ ఆవిష్కరణ

సామాన్యుడి అస్త్రం జనగామ

సౌర శక్తి అవగాహన కార్యక్రమం పై జనగామ పట్టణంలో జనగామ అమ్మ ఫౌండేషన్ ఆఫీస్ వద్ద సౌర శక్తి వల్ల ఉపయోగాలు భావి భారత దేశ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తుందని పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ప్రజలకు తెలియజేయునది ఏమనగా, వేద రెనెక్స్ సంస్థ ఆధ్వర్యంలో జనగామ జిల్లాలో పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై సౌర శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత గల ఇంటికి రూ. 78,000 వరకు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ లభించును. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలిగే లాభాలపై జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ఈ అవగాహన కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు:

గృహాలలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించడం

నెలవారీ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించడం

పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా లభించే ప్రభుత్వ సబ్సిడీ వివరాలు తెలియజేయడం

స్వచ్ఛమైన, పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడం

సౌర శక్తి వినియోగం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన మరియు హరిత శక్తిని అందించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఇది దేశ అభివృద్ధితో పాటు రాబోయే తరాల ఆరోగ్యకరమైన జీవనానికి తోడ్పడుతుంది. అలాగే, వినియోగదారులు సులభంగా సౌర వ్యవస్థను ఏర్పాటు చేసుకునే విధంగా వేద రెనెక్స్ ద్వారా బ్యాంకులు



మరియు ఫైనాన్స్ సంస్థల సహకారంతో లోన్ (రుణ) సదుపాయం కూడా అందించబడుతుంది. దీని ద్వారా తక్కువ ప్రారంభ ఖర్చుతో సౌర విద్యుత్ వ్యవస్థను స్థాపించుకోవచ్చు. వేద రెనెక్స్ సంస్థ గృహాలు, వాణిజ్య భవనాలు మరియు పరిశ్రమలకు డిజైన్ నుండి ఇన్‌స్టాలేషన్, నెట్ మీటరింగ్ మరియు ఆఫ్టర్-సేల్స్ సేవల వరకు పూర్తి స్థాయి సౌర విద్యుత్ పరిష్కారాలను అందిస్తున్న నమ్మకమైన సంస్థ.

ఈ అవగాహన కార్యక్రమం ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని, స్వచ్ఛమైన మరియు హరిత శక్తి వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించబడినది.

### సంస్థ వివరాలు

పేరు: ఎ. రామ ఫణీంద్ర

హోదా: చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఓ)

సంస్థ: వేద రెనెక్స్

జనగామ జిల్లా సమన్వయ బాధ్యతలు

మణి మంతెన 9959922361

రవి కొయ్యాడ 9949468736

# ప్రశాంతంగా మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు

## సీపీ గౌష్ ఆలం ప్రత్యక్ష పర్యవేక్షణ

సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :

హుజురాబాద్ నియోజకవర్గంలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా రంగంలోకి దిగి పర్యవేక్షణ చేపట్టారు.

డ్రోన్ కెమెరాల సహాయంతో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సరళిని సీపీ పరిశీలిస్తున్నారు. మూడో దశ ఎన్నికలు జరుగుతున్న ఐదు మండలాల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు నియమితులైన సిబ్బంది పనితీరుపై సీపీ ప్రత్యేక దృష్టి సారించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు, పోలీసు బలగాల మోహరింపు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, "ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు కొనసాగించాలి" అని అధికారులకు, సిబ్బందికి



సూచించారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో నిరంతర అప్రమత్తతతో పోలీసులు విధులు నిర్వహించాలని ఆదేశించారు. మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా కరీంనగర్ పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయిలో నిమగ్నమై ఉందని సీపీ స్పష్టం చేశారు

# ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి ఆయుధం

**మూడో విడత ఓటింగ్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఓటింగ్‌లో హుజురాబాద్ శాసనసభ సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, కెసిఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాట పట్టిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. గడిచిన రెండు విడతల గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గణనీయమైన సంఖ్యలో సర్పంచ్



స్థానాలను దక్కించుకుందని గుర్తు చేశారు. మూడో విడతలోనూ బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సర్పంచ్ స్థానాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు

# త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం

పాడేరు నియోజకవర్గ సమస్యలపై మంత్రితో కీలక చర్చ

క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే విజయాలు : మంత్రి నారా లోకేష్ తో కిల్లు, వెంకట రమేష్ నాయుడు. భేటీ

సామాన్యుడి అస్త్రం అల్లూరి :

ఆంధ్రప్రదేశ్ టూరిజం డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు ఈరోజు రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గంలో పార్టీ ఎదుర్కొంటున్న సమస్యలు, అలాగే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. నియోజకవర్గంలో కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక స్థాయిలో పరిష్కారం కావలసిన అంశాలు, అభివృద్ధి పనుల వేగం వంటి విషయాలను కిల్లు వెంకట రమేష్ నాయుడు మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేష్ బాబు "ప్రతి సమస్యను సీరియస్‌గా పరిశీలించి, త్వరలోనే పరిష్కారం చేస్తాం" అని భరోసా ఇచ్చారు. అలాగే, కార్యకర్తలు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వెళ్లి నిరంతరం పని చేయాలని మంత్రిగారు సూచించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, పరిష్కార దిశగా కృషి చేసినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. పాడేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ బాబు గారు మరోసారి ధృవీకరించారు. ఈ భేటీతో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం, నమ్మకం మరింత పెరిగింది అని నాయకులు అభిప్రాయపడ్డారు.



# భవిష్యత్ బిఆర్ఎస్‌దే

యువత చూపు బీ.ఆర్.ఎస్ వైపు

కొండాపూర్‌లో బీజేపీ నుంచి బీ.ఆర్.ఎస్‌లోకి భారీ చేరికలు



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీ.ఆర్.ఎస్ పార్టీ బలం రోజు రోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున బీ.ఆర్.ఎస్ వైపు ఆకర్షితులవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొండాపూర్ డివిజన్‌లో అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ యువమోర్చా వైస్ ప్రెసిడెంట్ కార్తీక్‌తో పాటు ఆయన అనుచరులు సుమారు 50 మంది బీ.ఆర్.ఎస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు సీనియర్ నాయకులు మల్లారెడ్డి, సంగారెడ్డి రెడ్డిగార్లు వేదికపై పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ%” యువత బీ.ఆర్.ఎస్‌లోకి రావాలి. బీ.ఆర్.ఎస్ పార్టీలో చేరిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పార్టీ బీ.ఆర్.ఎస్. అలాంటి పార్టీలో చేరడం గర్వకారణం" అని అన్నారు. బీజేపీ నుంచి బీ.ఆర్.ఎస్‌లో చేరిన కార్తీక్‌కు, అలాగే ఆయనతో పాటు చేరిన అనుచరులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలను అందరం కలుపుకొని పోవాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు బీ.ఆర్.ఎస్ పార్టీకే మద్దతుగా ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గంలో బీ.ఆర్.ఎస్ జెండా ఎగురవేస్తాం. యువత ముందుకు వస్తోంది అంటే పార్టీపై ప్రజల నమ్మకం పెరుగుతున్నట్టే" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చారి, రాము, అన్వర్, శివ, నాగ్‌రాజ్, బల్‌రాజ్, సాయి, బాబు, శ్రీను, చిన్న, పవన్, అనంత్ రెడ్డి, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గుండా నాగరాజు లావణ్య పెళ్లిరోజు సందర్భంగా అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి వద్ద అన్నదానం కార్యక్రమం



సామాన్యుడి అస్త్రం జనగామ

ఏబీవీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీ శ్రీమతి గుండా నాగరాజు లావణ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా జనగామ జిల్లా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా పెళ్లిరోజు వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా శ్రీ గుండా నాగరాజు మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు గత కొన్ని సంవత్సరాలుగా చూస్తున్నాను మీకు యువతకు ఎంతో ఆదర్శమని ఎలాంటి లాభాలు లేకుండా భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా జనగామ అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని జనగామ అమ్మ ఫౌండేషన్ టీం ను ఘనంగా సన్మానం చేశారు ఈ సేవా కార్యక్రమంలో గందేకృష్ణమోహన్ బుస్సా సంపత్ నులకపురి శ్రీధర్ నూరుద్దీన్ మహమ్మద్ జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, కార్యదర్శి వంగ భీమ్ రాజు, పండుగ నరేష్, బింగి నరసింహులు, ఎండి అప్రోచ్, పల్లె హరీష్, గోల్కొండ మహేష్ ,గొల్కొండ శ్రీనివాస్ ,గుగులోత్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు

## సింగపూర్‌లో కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించిన వొడితల ప్రణవ్

సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :




హుజురాబాద్ మండల పరిధిలోని సింగపూర్ గ్రామంలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కుటుంబ సమేతంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని, ప్రతి పౌరుడు తప్పనిసరిగా తన ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. గ్రామాల్లో సురక్షిత, పారదర్శక పాలనకు ఓటే పునాది అని పేర్కొన్నారు. గ్రామం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని, రాష్ట్రం బాగుంటే దేశం బాగుంటుందన్న సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి బలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఓటింగ్‌లో భాగస్వాములయ్యారు




# ఇగ్నైట్ కళాశాల హాస్టల్లో విద్యార్థి ఆత్మహత్య

## ర్యాగింగ్ కారణమంటూ కళాశాల ముందు కుటుంబ సభ్యుల ఆందోళన

**సామాన్యుడి అస్త్రం, నిఘావిభాగం :** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఉన్న ఇగ్నైట్ కళాశాలలో చోటుచేసుకున్న విద్యార్థి శ్రీ కేతన్ (17) మృతి అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఆత్మహత్యగా భావిస్తున్న ఈ ఘటనలో అనేక పరిస్థితులు, కుటుంబ ఆరోపణలు, సహ విద్యార్థుల వాంగ్మూలాలు పలు అనుమానాలకు తవిస్తున్నాయి. కేతన్ హాస్టల్ గదిలో లోపల కిటికీకి ఉరివేసుకున్నట్లు చెప్పడంతో తల్లిదండ్రులకు విద్యార్థి సంఘాలను ఆలోచనలో పడేస్తున్నాయి. సాధారణంగా హాస్టల్ గదుల్లో భద్రతా చర్యలు, వార్డెన్ పర్యవేక్షణ ఉండాల్సినప్పటికీ, ఆ రోజు అవేవీ కనిపించలేదని సహ విద్యార్థి చెబుతున్నారు. కేతన్ ఆరు అడుగుల ఎత్తు ఉండటం, కిటికీ ఎత్తు, ఉరి వేసుకునే పరిస్థితులు అనుమానాస్పదంగా ఉన్నాయని కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ ఘటనలో తల్లిదండ్రులు ముఖ్యంగా చెప్తున్నా విషయం ఏమిటి అంటే కేవలం జూనియర్స్ మాత్రమే ఉంటారు, ఈ క్యాంపస్ లో కేవలం 120మంది విద్యార్థులంటారు అని యాజమాన్యం జాయినింగ్ టైం లో చెప్పారని, శ్రీనికేతన్ మిత్రుడు కూడా ఇదే క్యాంపస్ లో చాదుతున్నాడానే ధైర్యం తో ఇక్కడ జాయిన్ చేశామని, కానీ ఇప్పుడు ఒక సీనియర్ విద్యార్థి తో హాస్టల్ షేరింగ్ ఇచ్చారని, తోటి విద్యార్థి చెప్తున్నా విధంగా ర్యాగింగ్ జరిగి ఉండొచ్చు ఆరోపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఘటన జరిగితే రాత్రి 9 గంటలకు మాకు చెప్పారని మేము మా గ్రామం ఇల్లందు కొత్తగూడెం జిల్లా నుండి ఉదయం 3 వరకు కాలేజీ దగ్గరకు చేరుకుంటే అప్పటి నుండి ఇప్పటి వరకు ( బుధవారం ఉదయం 11 గంటలవరకు) యాజమాన్యం కలవకుండా కనీసం మా అబ్బాయి గదికి వెళ్లానివ్వడం లేదని వాపోయారు. కాలేజీ లో ఉన్న సీసీటీవీ చూపించమన్నా అడిగెందుకు ప్రయత్నించగా మానేజ్మెంట్ తప్పించుకు తిరుగుతుంది అని శ్రీకేతన్ పెదనాన్న అన్నారు. ఎవరైనా ఒత్తిడి తెచ్చారా? మానసిక వేధింపులు జరిగాయా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు కోరారు.

**ర్యాగింగ్ భయం... మౌనంగా బాధపడిన విద్యార్థి?**

కేతన్ మృతి వెనుక ర్యాగింగ్ కారణమై ఉండొచ్చని కుటుంబ సభ్యులు స్పష్టంగా ఆరోపిస్తున్నారు. కళాశాలలో సీనియర్ విద్యార్థుల నుంచి మానసిక వేధింపులు ఎదుర్కొన్నాడని, వాటి వల్ల తీవ్ర ఒత్తిడికి గురయ్యాడని వారు చెబుతున్నారు. కొత్తగా చేరిన విద్యార్థులపై ర్యాగింగ్ జరగడం సాధారణమైపోయిందని పలువురు విద్యార్థులు పేరు చెప్పకుండా వెల్లడిస్తున్నారు. ర్యాగింగ్ అనేది కేవలం శారీరక వేధింపులు మాత్రమే కాదు, మాటలతో, బెదిరింపులతో, అవమానాలతో కూడా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటున్న విద్యార్థులు భయంతో బయటకు చెప్పలేకపోతారని, చివరికి ఒంటరిగా మిగిలిపోతారని వారు అంటున్నారు. కేతన్ కూడా ఇలానే మౌనంగా బాధపడినట్టు అనుమానాలు ఉన్నాయి. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పకుండా తనలోనే సమస్యలు దాచుకున్నాడని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ర్యాగింగ్ నివారణ కమిటీలు కేవలం పేపర్లకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తున్నాయి.

**కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం: భద్రత ఎక్కడ? పర్యవేక్షణ ఎక్కడ?**

ఈ ఘటనపై కళాశాల యాజమాన్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హాస్టల్‌లో సరైన వార్డెన్ లేకపోవడం, స్టడీ అవర్స్ తర్వాత విద్యార్థుల కదలికలపై పర్యవేక్షణ లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన ఆలస్యం కావడం వంటి అంశాలు బయటపడుతున్నాయి. కేతన్ గదిలోకి వెళ్లిన తరువాత చాలా సేపటికి ఘటన వెలుగులోకి రావడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతి చెందిన విషయాన్ని కూడా తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియజేశారని వారు చెబుతున్నారు. విద్యార్థుల భద్రతకు సంబంధించి స్పష్టమైన ప్రోటోకాల్ ఉందా? హాస్టల్‌లో మానసిక కౌన్సిలింగ్ సదుపాయాలున్నాయా? అన్న ప్రశ్నలకు కళాశాల నుంచి స్పష్టమైన సమాధానాలు రావడం లేదు. ఇదే నిర్లక్ష్యం మరో విద్యార్థి ప్రాణాన్ని తీసిందని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు.

**పోలీసుల విచారణ: అన్ని కోణాల్లో దర్యాప్తు**

కేపీహెచ్‌బీ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చెప్పడతామని, ఇది ఆత్మహత్యేనా? లేక ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసా? అన్న అంశాలపై దృష్టి పెట్టి. ర్యాగింగ్ ఆరోపణలపై సీనియర్ విద్యార్థులను విచారిస్తామన్నారు. పోస్టుమార్టం నివేదిక, డిజిటల్ సాక్ష్యాల ఉంటే వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కేతన్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ర్యాగింగ్ కారణమంటూ
కుటుంబ సభ్యుల ఆందోళన

---

విద్యార్థి మృతి ఆత్మహత్యా?
లేక వ్యవస్థాగత నిర్లక్ష్యమా?

---

కళాశాల యాజమాన్య నిర్లక్ష్యం
భద్రత ఎక్కడ? పర్యవేక్షణ ఎక్కడ?

---

విద్యార్థి సంఘాల ఆగ్రహం
న్యాయం కావాలంటూ డిమాండ్లు

**విద్యార్థి సంఘాల ఆగ్రహం: న్యాయం కావాలంటూ డిమాండ్లు**

ఈ ఘటనపై పలు విద్యార్థి సంఘాలు తీవ్రంగా స్పందించాయి. నవ తెలంగాణ విద్యార్థి శక్తి, ఎ ఐఎఫ్ డి ఎస్, తెరాస విద్యార్థి విభాగం, తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం, ఎస్ ఎఫ్ ఐ వంటి సంఘాలు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టాయి.



"ఇది వ్యక్తిగత ఘటన కాదు, వ్యవస్థ వైఫల్యమని ర్యాగింగ్ ఒక్కటే కాదు అనుమతులు లేకుండా ఇలాంటి కళాశాలలు నడుస్తున్న రేవంత్ సర్కార్ నిద్రమత్తు వీడి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతాయి" ఇది ముమ్మాటికీ యాజమాన్యం నిర్లక్ష్యం అని నవతెలంగాణ విద్యార్థి శక్తి అధ్యక్షులు పవన్ అన్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభుత్వానికి, యాజమాన్యాలకు ఎలాంటి పట్టింపు లేదని విమర్శించారు. ప్రతి కళాశాలలో కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య శాఖకు మినిస్టర్ లేకపోవడం దారుణమని పట్టించుకున్న నాదుడు లేక ఇలాంటి కళాశాలు పుట్టగొడుగుల పుట్టుకోస్తున్నాయి వీటిపై వెంటనే చర్యలు తీయనుకోవాలని స్టేట్ అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు.

